విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం
- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
- ఘటనా స్థలంలోనే కుమారుడు మృతి
- దవాఖానలో చికిత్స పొందుతూ తండ్రి కన్నుమూత
- నిర్మల్ జిల్లాలో ఘటన

03

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం తగదు

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టర్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం

03

www.aksharadarbar.com బుధవారం 09, అక్టోబర్ 2024

అక్షర దర్బార్

voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :209 | పేజీలు : 05 | వెల : 05

కొలువుల దసరా..

- పండుగ తర్వాత విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న కొరత
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకున్న డీఎస్సీ అభ్యర్థులు
- ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించిన అధికారులు
- ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా సభ
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్య

05

భలే మొగుడు

- లంచగొండి భార్యను ఏసీబీకి పట్టించిన భర్త
- నోట్ల కట్టల వీడియోను బయట పెట్టిన వైనం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

05

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

అమ్మకు తోడుగా అనంత లోకాలకు..

- అనారోగ్యంతో తల్లి కన్నుమూత
- కొద్దిసేపటికే చిన్న కుమారుడు మృతి
- ఒకే కుటుంబంలో ఒకే రోజు ఇద్దరు మరణం
- పండగ పూట తీవ్ర విషాదం
- ముల్కనూర్ గ్రామంలో ఘటన

అక్షరదర్బార్, హన్మకొండ : పండగ పూట తల్లీకొడుకు గంటల వ్యవధిలో మృతిచెందిన విషాదఘటన జిల్లాలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. అనారోగ్యంతో తల్లి శోభ (60) బుధవారం ఉదయం మృతిచెందగా గంట వ్యవధిలో చిన్న కుమారుడు సాయికిరణ్ (28) చనిపోయాడు. కాగా సాయికిరణ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. పండగ పూట ఒకే కుటుంబంలో ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, కుటుంబసభ్యుల రోదనలు కన్నీళ్లుపెట్టించాయి.

మృతి చెందిన తల్లీ కొడుకు

మరిపెడ ఠాణాలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- రికార్డులు, పరిసరాల పరిశీలన

అక్షరదర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ బుధవారం మరిపెడ పోలీస్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. పోలీసు స్టేషన్ రికార్డులు, పరిసరాలను తనిఖీ చేశారు. 5s ఇంప్లిమెంటేషన్ విధానాన్ని పరిశీలించారు. యస్ హెచ్ఒ, సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సస్పెక్ట్, హిస్టరీ షీటర్ ల కదలికలను చెక్ చేయాలని, యాక్టివ్ గా ఉన్న వారందరూ ఎలాంటి కార్యకలాపాలు చేస్తున్నారో చెక్ చేయాలని అన్నారు. నేరస్తుల షీట్ ఓపెనింగ్ కోసం ప్రపోజల్స్ పంపాలని ఎస్ హెచ్ఓ కు సూచించారు. దీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న ఎన్ బిడబ్ల్యులు త్వరగా ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను బాధ్యతయుతంగా నిర్వర్తించాలని చెప్పారు. తరచూ జరుగుతున్న సైబర్ నేరాల గురించి ఆయా గ్రామాలు, కాలనీలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సైబర్ నేరాలకు గురి అవుతున్నవారిలో అధికంగా విద్యావంతులే ఉంటున్నారని, అత్యాశకు పోయి అనవసర లింక్ లు ఓపెన్ చేయకూడదని ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలను కోరారు. ఆన్ లైన్ లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైనట్లైతే 1930 లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ https://cybercrime.gov.in నందు కాని ఫిర్యాదు చేయాలన్నారు.

అనుమతులు లేకుండా డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్ వో డాక్టర్ మురళీధర్

అక్షర దర్బార్,తొర్రూరు : అనుమతులు లేకుండా దయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గుండాల మురళీధర్ హెచ్చరించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఎల్.వై.ఆర్ గార్డెన్ రోడ్డులో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మాతృశ్రీ డయాగ్నస్టిక్ సెంటర్ ను పోలీస్ అధికారులతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బృందం సీజ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గుండాల మురళీధర్ మాట్లాడుతూ... ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి అనుమతి తీసుకోవాలని, ఆసుపత్రికి వస్తున్న డాక్టర్ల కన్సల్టేషన్ వివరాలను కనబడే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ జ్వాలిత, డాక్టర్ మీరాజ్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, స్థానిక గిరిదావర్ బషీర్, సబ్ ఇన్స్పెక్టర్ వెంకటకృష్ణారెడ్డి, ఏఎస్ఐ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్ ను సీజ్ చేస్తున్న అధికారులు

ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

అక్షర దర్బార్, పరకాల : పరకాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి, మండల వైద్యాధికారి డాక్టర్ స్వాతి, కార్యాలయ సూపరిండెంట్ సిహెచ్ శైలశ్రీ, మండల పంచాయతీ అధికారి ఇమ్మడి భాస్కర్, ఏ.పి.ఓ ఇందిర, ఏపియం క్రాంతి, పంచాయతీ కార్యదర్శులు ,ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ కార్యాలయ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు .

బొగ్గు లారీ ఢీకొని వ్యక్తి మృతి

అక్షర దర్బార్, మల్హర్ : తాడిచెర్ల ఓసీపీ నుంచి మంగళవారం రాత్రి బొగ్గులారీ అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో గొడిసెల శ్రీకాంత్ (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి స్వగ్రామం పెంచికల్ పేట. అతడు ఓసీపీలో మూడేళ్లుగా సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తూ తాడిచెర్లలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని అత్తవారి గ్రామం చిన్నతూండ్లకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో మృతుడి ముగ్గురు ఐదేళ్లలోపు చిన్నారులు, భార్య రోడ్డున పడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మృతదేహంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తాడిచెర్ల–కొయ్యూర్ రోడ్డుపై ఆందోళన చేపట్టి బైఠాయించారు.

బతుకమ్మ సంబరాలు

- పాల్గొన్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాష

అక్షరదర్బార్, జనగామ: జనగామ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనం ఆవరణలో టీఎన్జీఓ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అధికార యంత్రాంగం బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ తో కలిసి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ హాజరయ్యారు. కలెక్టర్ సతీసమేతంగా బతుకమ్మ పాటలకు లయబద్ధంగా అటలాడగా.. మహిళల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది.

బతుకమ్మతో కలెక్టర్, కుటుంబ సభ్యులు

గ్రూప్ -1 అభ్యర్థులకు గుడ్ న్యూస్

- 14 నుంచి మెయిన్స్ ఎగ్జామ్ హాల్ టికెట్లు డౌన్ లోడ్..
- 21నుంచి 27వరకూ ఏడు రోజుల పాటు పరీక్షలు
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 31,382 మంది అభ్యర్థులు

అక్షరదర్బార్, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త చెప్పింది. ఈనెల 14న అభ్యర్థులు టీజీఎస్పీఎస్సీ అధికారిక వెబ్సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవ్చని తెలిపింది. మెయిన్స్ పరీక్షల కోసం ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నట్లు తెలుపుతూ టీజీఎస్పీఎస్సీ ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేసింది. గ్రూప్–1 ఫైనల్ పరీక్షలు ఈనెల 21నుంచి 27వరకూ ఏడు రోజులపాటు జరిగే పరీక్షలు రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకూ కొనసాగనున్నాయి. అయితే పరీక్ష హాల్లోకి మధ్యాహ్నం 12.30 గంటల నుంచే అభ్యర్థులను అనుమతించనున్నారు.

31,382 మందికి అర్హత

గ్రూప్–1 మెయిన్స్కు మొత్తం 31,382 మంది అర్హత సాధించగా వారంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2025 జూన్ 9న జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలకు మొత్తం 3.02లక్షల మంది హాజరుకాగా.. ఫైనల్ పరీక్షలకు 31,382మంది ఎంపికయ్యారు. మెయిన్స్ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో జరగనున్నాయి. అలాగే జనరల్ ఇంగ్లిష్ పేపర్ మినహా మిగిలినవన్నీ అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలోనే రాస్తారు. గ్రూప్–1 మెయిన్స్లో మొత్తం ఆరు పేపర్లు ఉండనున్నాయి.

మొక్కలను సంరక్షించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్,భూపాలపల్లి: నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. పట్టణంలోని ప్రధాన డివైడర్ మధ్యలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి, మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యకరంగా ఉండే మొక్కలను నాటామని.. వాటిని సురక్షితంగా కాపాడుకునే బాధ్యత మనందరిదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా కేంద్రాలపై పోలీసుల దాడులు

అక్షర దర్బార్,మహాదేవపూర్ : మహదేవపూర్, పలిమెల మండలాల్లో గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసులు ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మహదేవపూర్ మండలంలోని సూరారం, కాళేశ్వరం, కన్నేపల్లి, పలిమెల మండలంలోని సర్వాయిపేట, వంకెన గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2320 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయగా 124 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. 13 మందిపై కేసులు నమోదు చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఎస్సైలు పవన్ కుమార్, తమాషా రెడ్డి, చక్రపాణి, ఎక్సైజ్ ఎస్సైలు, సీఐలు పాల్గొన్నారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం
09.10.2024

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం తగదు

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టర్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం

అక్షరదర్బార్, వరంగల్: ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారి అనురాధ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం ఎలా గుర్తించాలి అనే అంశంపై అగ్రికల్చర్ యూనివర్సిటీ సైంటిస్టులు డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ వెంకన్నతో సంబంధిత శాఖల అధికారులు, ఏవోలు ఏఈఓలతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు జిల్లాలో 203 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం దొడ్డు రకం వడ్లను రెండు రకాలు నిల్వ చేసేందుకు వేరువేరు కౌంటర్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని స్వీకరించనున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటను జిల్లాలోని వివిధ మండలస్థాయి వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని అన్నారు. కార్యక్రమంలో అదరపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్య దేవి, డీఎంవో సురేఖ, డీసీఓ నీరజ, డీసీఎస్ఓ ఉమారాణి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లోనే అకౌంట్ లో డబ్బులు

- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- సన్న ధాన్యానికి రూ. 500 బోనస్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- నల్లగొండలో రాష్ట్రంలోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరదర్బార్, నల్లగొండ: రైతులకు ఇబ్బందులు కలగకుండా 3 రోజుల్లోనే వారి బ్యాంకు అకౌంట్లో ధాన్యం అమ్మిన డబ్బులు జమ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నల్గొండ జిల్లాలో గత సీజన్లో సైతం ధాన్యం కొన్న 3 రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేశామని గుర్తుచేశారు. వానకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏవైనా ఇబ్బందులు ఏర్పడినా లేదా చెల్లింపులు ఆలస్యమైనా జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 9963407064 కు ఫోన్ చేసి తెలియజేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రత్యేకించి సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ సైతం ఇస్తున్నదని తెలిపారు. గ్రేడ్ –ఏ ధాన్యానికి క్వింటాల్‌కు 2320 రూపాయల మద్దతు ధర, సాధారణ రకానికి 2320 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించిందని తెలిపారు. మిల్లర్లు సన్న బియ్యంతో పాటు, దొడ్డు రకానికి సైతం ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా తీసుకోవాలని అన్నారు.

పదిరోజుల్లో వారి రుణాలు మాఫీ..

తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, ఒకేసారి రాష్ట్రంలోని 22 లక్షల మంది రైతులకు రూ. 18 వేల కోట్ల రుణాలు రుణమాఫీ చేసిందని అన్నారు. రెండు లక్షల కన్నా ఎక్కువ ఉన్న వారి రుణాలను వారం పది రోజుల్లో మాఫీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతోపాటు పేదలకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వనున్నామని, 500 రూపాయలకే ఎల్పీజీ కనెక్షన్ ఇస్తున్నామని తెలిపారు. అన్ని కులాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని 200 కోట్లు రూపాయలతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లను కట్టిస్తున్నామని, మొదటి విడతన 20 నియోజకవర్గాలలో ఈనెల 11న పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో 70వేల ఉద్యోగాలు ఇచ్చామని, బుధవారం 11,000 మంది డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లకు నియామకపత్రాలు అందజేసినట్లు చెప్పారు. బ్రాహ్మణ వెల్లెంల ద్వారా డిసెంబర్లో చెరువులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు రూ. 25 కోట్లు విడుదల చేయనున్నామని అన్నారు. జిల్లాలో యంత్రాంగం ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
- ఘటనా స్థలంలోనే కుమారుడు మృతి
- దవాఖానలో చికిత్స పొందుతూ తండ్రి కన్నుమూత
- నిర్మల్ జిల్లాలో ఘటన

అక్షరదర్బార్, నర్సాపూర్ : రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడు దుర్మరణం చెందిన ఘటన నర్సాపూర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం మన్మద్ గ్రామానికి చెందిన సంగెం సురేష్ (27) దసరా సెలవుల్లో భార్యా పిల్లలతో కలిసి అత్తగారి గ్రామం అయిన ఆదిలాబాద్ జిల్లా కుచులాపూర్ వెళ్లారు. బుధవారం ఉదయం గ్రామానికి తిరిగివస్తున్న క్రమంలో నర్సాపూర్ (జి) మండలం తురాటి గ్రామ సమీపంలో భైంసా– నిర్మల్ జాతీయ రహదారి కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో కుమారుడు దీక్షిత్ కుమార్ (7) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సంగెం సురేష్‌తో పాటు భార్య, కూతురును చికిత్స కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సంగెం సురేష్ మృతి చెందారు. కాగా సురేష్ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రీ కొడుకుల మరణాలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- కమిషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్
- సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- 60 రోజుల్లో వన్ మెన్ కమిషన్ రిపోర్ట్..
- ఆ తర్వాత ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..

అక్షరదర్బార్, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై కీలక ముందడుగు పడింది. వర్గీకరణ కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. సబ్ కమిటీ సూచనల ఆధారంగా ముందుకు వెళ్లాలని సూచించారు. అంతేగాక ఎస్సీ వర్గీకరణపై 60 రోజుల్లోనే వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు క్లారిటీ ఇచ్చారు. గత ఆగస్ట్‌లో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అధికారం ఉంటుందని స్పష్టంచేసింది. ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 మెజారిటీతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును వెల్లడించింది. దీంతో రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారం వచ్చినట్లు అయింది. ఈక్రమంలోనే ఆయా రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతోంది. తెలంగాణలోనూ వర్గీకరణకు సంబంధించి మాదిగల నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

తెలంగాణలో కూడా ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నారు. సుప్రీం తీర్పుతో ఎస్సీ వర్గీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తుందని ఆయన విమర్శిస్తున్నారు. ఈమేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెండు నెలల్లో వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో.. వర్గీకరణకు రాష్ట్రం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎస్సీ వర్గీకరణను మాల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఎమ్మార్పీఎస్ నేతల అరెస్ట్

రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లో భారీఎత్తున ర్యాలీలు నిర్వహించి, ధర్నా చేయాలని ఆయన పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో హైదరాబాద్ పార్శీగుట్టలోని ఎమ్మార్పీఎస్ భవనం నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు బయల్దేరిన మందకృష్ణ మాదిగను పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు ర్యాలీని అడ్డుకొని ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈక్రమంలోనే నేడు ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయడం గమనార్హం.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

సీఎం రేవంత్ రెడ్డితో మల్లారెడ్డి భేటీ..

- అల్లుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం ఇంటికి..
- మనవరాలి వివాహ ఆహ్వాన పత్రిక అందజేత
- హాట్ టాపిక్‌గా మారిన ఇరువురి కలయిక
- ఇటీవలే ఏపీ సీఎం చంద్రబాబుతో మల్లారెడ్డి సమావేశం
- టీడీపీలో చేరుతారంటూ ప్రచారం..
- తాజాగా రేవంత్‌తో భేటీపై అనేక ఊహాగానాలు..

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి భేటీ కావడం సర్వత్రా హాట్ టాపిక్‌గా మారింది. జూబ్లీహిల్స్ లోని నివాసంలో బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి మల్లారెడ్డి కలిశారు. తన మనవరాలి వివాహానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. పెళ్లికి తప్పకుండా వస్తానని తెలిపారు. కాగా, నిన్న మొన్నటి వరకూ ఉప్పునిప్పుగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డితో మల్లారెడ్డి సమావేశం కావడం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. మనవరాలి పెళ్లి కోసం అంటూ రెండు రోజుల కింద ఏపీ సీఎం చంద్రబాబును, ఇవాళ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మల్లారెడ్డి కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పలు ఊహాగానాలు

కాగా మనవరాలి వివాహ పత్రికను అందజేసేందుకే సీఎం రేవంత్ ఇంటికి వచ్చినట్లు మల్లారెడ్డి స్పష్టం చేశారు. అంతకు మించి ఏమీలేదని అన్నారు. ఇప్పటికే ఈ వివాహపత్రికతో చంద్రబాబును కలిసినట్లు మల్లారెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఆ సమయంలో తీగల కృష్ణారెడ్డితో పాటు మల్లారెడ్డి, అతని అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి కలిసి చంద్రబాబుని కలవడంతో త్వరలో వీరు టీడీపీలో చేరబోతున్నారని ప్రచారం మొదలైంది. అయితే... కేవలం పెళ్లికి పిలవడానికే వెళ్లినట్లు మల్లారెడ్డి స్పష్టం చేస్తున్నారు. మరోపక్క హైదరాబాద్ లో హైడ్రా దాడుల నుంచి తమను చంద్రబాబు ఒక్కరే కాపాడగలరని మల్లారెడ్డి భావిస్తున్నారనే చర్చ జరుగుతుంది. ఈ సమయంలోనే తమ విద్యాసంస్థలపై హైడ్రా దాడులు జరిగే అవకాశం ఉందనే విషయంపైనా చర్చించి.. చంద్రబాబుని మల్లారెడ్డి రిక్వెస్ట్ చేశారనే చర్చ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో బలంగా నడుస్తుంది. ఏది ఏమైనా... కారణం మరేదైనా... అటు చంద్రబాబుని, ఇటు రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కలవడం మాత్రం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పలు ఊహాగానాలను, మరిన్ని రాజకీయ చర్చలకు వేదికైంది.

మాట్లాడుతున్న డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్ రావు

దసరా ఉత్సవాల నిర్వహణను అడ్డుకోవడం దుర్మార్గం

డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు

అక్షర దర్బార్,తొర్రూరు: దసరా ఉత్సవాల నిర్వహణను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని తొర్రూరు ఉత్సవ్ కల్చరల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొర్రూరు పట్టణంలో 2002 నుంచి దసరా ఉత్సవాలు–రావణ వధ వేడుకలను అత్యంత వైభవోపేతంగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా దేవాదాయ శాఖ అధికారులకు పర్మిషన్ కోసం దరఖాస్తు చేయగా కొంతమంది దుష్టశక్తులు అనుమతి రాకుండా అడ్డుకున్నారని వాపోయారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే దసరా ఉత్సవాలను నిర్వహించాచామని, వేలాదిమంది పాల్గొనే ఉత్సవాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. వేడుకల నిర్వహణ కోసం ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రజలు జరుగుతున్న పరిణామాలను గమనించగలరని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సభ్యులు కుర్ర శ్రీనివాస్ గౌడ్, చామకూరి ఐలయ్య, ధరావత్ జై సింగ్ నాయక్, శీలం లింగన్న గౌడ్, సంకటాల సోమేశ్వర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షరదర్బార్, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు – పద్మ దంపతులు తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు, ఎండోమెంట్ అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను గండ్రకు అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుంది

నర్సంపేట యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజు

అక్షర దర్బార్, దుగ్గొండి : డీఎస్సీ నిర్వహించి త్వరితగతిన ఉద్యోగ నియామకాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి కేవలం 3 నెలల్లోనే నియామక పత్రాలు అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి అంబాల చంద్రమౌళి

అక్షర దర్బార్, భూపాలపల్లి: వర్గీకరణ అమలు చేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి అంబాల చంద్రమౌళి అన్నారు. డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబాల చంద్రమౌళి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ ఆయా రాష్ట్రాల అభిప్రాయం మేరకు వర్గీకరణ చేపట్టాలని తీర్పునిచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం సుప్రీంకోర్టు తీర్పును తుంగలో తొక్కి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాదిగల నుంచి తీవ్ర ప్రతిఘటనలు తప్పవని హెచ్చరించారు.

సమన్వయంతో రైతులకు మేలు చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- ఆత్మకూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

అక్షరదర్బార్, ఆత్మకూరు: రైతులకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండేది మార్కెట్ కమిటీ చైర్మన్ పదవని, మార్కెట్ కమిటీ రైతులకు మేలు చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు అన్నారు. బుధవారం ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు దామెర ఫ్లై ఓవర్ ప్రతిమ క్యాన్సర్ హాస్పటల్ నుంచి గుడెప్పాడ్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ పాలకవర్గం అధికారులు, రైతులతో సమన్వయంగా ముందుకు సాగి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పాలకమండలి విజయవంతంగా సేవలందించి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఆత్మకూరు వ్యవసాయ కమిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని, ఏ విధంగా అభివృద్ధి చేయాలి, ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్, డైరెక్టర్లతోపాటు బి సుధాకర్ రెడ్డి సహా కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, పాల్గొన్న ఎమ్మెల్యేలు

డీఎస్సీ అభ్యర్థికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి

- పండుగ తర్వాత విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న కొరత
- సీఎం నుంచి నియామక పత్రాలు అందుకున్న డీఎస్సీ అభ్యర్థులు
- ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ కు తరలించిన అధికారులు
- ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా సభ
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై సీఎం ఫైర్
- తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్య

కొలువుల దసరా..

అక్షరదర్బార్, హైదరాబాద్: విద్యాశాఖలో ఉపాధ్యాయ కొలువుల కోలాహలం నెలకొంది. దసరా తర్వాత కొత్త టీచర్లంతా విధుల్లో చేరనున్నారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. దీంతో వివిధ పాఠశాలల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టుల్లోకి కొత్తగా టీచర్లు రానున్నారు. ప్రభుత్వం జూలై, ఆగస్టు మాసాల్లో నిర్వహించిన డీఎస్సీ-2024 పరీక్ష ఫలితాలను గత వారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. 1:3 పద్ధతిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అలాగే 2008లో జరిగిన డీఎస్సీలో 30 శాతం కోటా అర్హత కలిగిన బీఈడీ అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ రెండు డీఎస్సీలకు సంబంధించి నియామక ప్రక్రియ నేటితో పూర్తయింది. 2008 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకోనున్నారు. దీంతో అభ్యర్థులతోపాటు వారి కుటుంబసభ్యుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పదేళ్లలో నిరుద్యోగ సమస్య తీరలేదు

ప్రత్యేక తెలంగాణ కోసం ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని, స్వరాష్ట్రం ఏర్పాటు జరిగినా గత పదేళ్ళలో నిరుద్యోగ సమస్య తీరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్య గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు. ఎల్బీ స్టేడియంలో 10 వేల టీచర్లకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఈ నియామకాలను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నించాయనీ, అయితే అన్నీ అవాంతరాలనూ వ్యూహాత్మకంగా తిప్పికొట్టి, అనుకున్న సమయానికి నియామకాలను పూర్తి చేసినట్లు సీఎం వెల్లడించారు. రెండుసార్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నామని పేర్కొన్న రేవంత్ రెడ్డి ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించారు కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయని అన్నారు. నిరుద్యోగుల సమస్యలు బీఆర్ఎస్ ఏనాడు పట్టించుకోలేదని మండిపడ్డారు. తండ్రీకొడుల ఉద్యోగాలు ఊడగొడితే.. మీకు ఉద్యోగాలు వస్తున్నాయని రేవంత్ కేసీఆర్, కేటీఆర్ లను టార్గెట్ చేశారు. అధికారంలోకి వచ్చిన 9 నెలలోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని పేర్కొన్నారు. డీఎస్సీ విజేతలను చూస్తుంటే దసరా ముందే వచ్చినట్లు ఉంది" అని రేవంత్ రెడ్డి చెప్పారు.

రాజధానికి తరలిన డీఎస్సీ అభ్యర్థులు

ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలు స్వీకరించేందుకు వరంగల్, హన్మకొండ జిల్లాల నుంచి డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈమేరకు టీజీ ఆర్టీసీ బస్సులను వరంగల్ కలెక్టరేట్ వద్ద కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా నుంచి డీఎస్సీకి మొత్తం 169 మంది అభ్యర్థులు ఎంపికవగా వారందరి కోసం నాలుగు బస్సులను ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్‌లోని మహబూబాబాద్, జనగామ, ములుగు, భూపాలపల్లి జిల్లాల నుంచి కూడా అభ్యర్థులు ప్రత్యేక బస్సుల్లో ఎల్బీ స్టేడియానికి తరలివెళ్లారు. ఆయా జిల్లాల అధికారులు జెండాలు ఊపి వాహనాలను తరలించారు.

భలే మొగుడు

లంచగొండి భార్యను ఏసీబీకి పట్టించిన భర్త
నోట్ల కట్టల వీడియోను బయట పెట్టిన వైనం
సోషల్ మీడియాలో వీడియో వైరల్

అక్షరదర్బార్, హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఓ ప్రభుత్వ ఉద్యోగి లంచాలకు అలవాటుపడింది. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయింది. అయితే ఇది ఇష్టంలేని భర్త ఆమెకు ఊహించని షాకిచ్చాడు. లంచగొండి భార్యను అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టించాడు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైన ఈ ఘటన హైదరాబాద్‌లోని మణికొండలో చోటుచేసుకుంది. మణికొండ మున్సిపల్ ఆఫీస్‌లో డీఈఈగా పని చేస్తున్న దివ్యజ్యోతి లంచాలకు అలవాటుపడిందని భర్త శ్రీపాద్ ఆరోపిస్తున్నాడు. ప్రతి రోజు అక్రమంగా లక్షల్లో డబ్బు తీసుకొచ్చి ఇంట్లో ఎక్కడపడితే అక్కడ పెడుతుందని, తప్పంటే తననే తిట్టేదని వీడియోలు తీసి మరీ మీడియాకు పట్టించాడు. బీరువాలో, పరుపుకింద, దేవుడి గదిలో, కిచెన్‌లో, పూల కుండీల వెనుక... ఇలా అనేకచోట్ల న్యూస్ పేపర్లో చుట్టిన నోట్ల కట్టల వీడియోను శ్రీపాద్ బయటపెట్టాడు. అంతేగాక స్వయంగా ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి భార్యను పట్టించాడు. లంచం తీసుకోవడంపై భార్యాభర్తల మధ్య చాలాసార్లు గొడవలు జరిగినట్లు తెలుస్తుంది. అయినా తీరు మార్చుకోకపోవడంతో లంచగొండి భార్యను అధికారులకు పట్టించాడు భర్త.

సమావేశంలో మాట్లాడుతున్న కాసర్ల నరసింహారెడ్డి

జర్నలిస్టులు విలువలతో పని చేయాలి

వర్కింగ్ జర్నలిస్ట్ అడ్ హక్ కమిటీ చైర్మన్ కాసర్ల నరసింహారెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట : జర్నలిస్టులు విలువలతో పని చేయాలని నర్సంపేట డివిజన్ విలేకరుల సంఘం అడ్ హక్ కమిటీ చైర్మన్ కాసర్ల నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట డివిజన్ విలేకరుల సంఘం అడ్ హక్ కమిటీ చైర్మన్‌గా కాసర్ల నర్సింహారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు విలువలు ముఖ్యమని, విలువలతో కూడిన జర్నలిజాన్ని నేటి సమాజం కోరుకుంటుందని, నిజాయితీగా నిష్పక్షపాతంగా జర్నలిస్టులు తమ పాత్రను నిర్వర్తించాలన్నారు. సమావేశంలో జర్నలిస్టులు మేదరబోయిన శ్రీనివాస్, కుంటమల్ల అరవింద్, మురళీధర్, రంజాన్, అశోక్ రావు, వెంకట్ నారాయణ, శ్రీనివాస్, జెల్లా నరేష్, నరేష్ , సుమంత్,వీరభద్రం ,కార్తీక్ శ్రీకాంత్ బేతం అఖిల్, సురేష్, సుధాకర్, రమేష్ ,మహేష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా అజయ్ కుమార్

చెన్నారావుపేట, అక్షర దర్బార్ : పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండలంలోని మగ్దుంపురం గ్రామానికి చెందిన బుర్ర అజయ్ కుమార్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుర్ర అజయ్ కుమార్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో పదవీ బాధ్యతలు కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గఫార్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రేగూరు సుభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్ కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

అక్షర దర్బార్ ,భూపాలపల్లి : అధికారులు తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వ హాస్పిటల్ క్యాంటీన్ నిర్వాహకుడు కప్పల రాజేష్ వేడుకున్నాడు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలిసి వినతి పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ఆసుపత్రిలో తాను చేసిన సేవలను గుర్తించి గత అధికారులు తనకు ఆసుపత్రిలో క్యాంటిన్ ఇచ్చి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుతో తనను ఖాళీ చేయాలని చెప్పి నోటీసులు పంపించారని, దీంతో తన కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మహిళా సంఘాలలో పనిచేస్తున్న తన తల్లి, అక్కలకు క్యాంటీన్ కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.

నిరసన తెలుపుతున్న బాధితుడు

స్నేహితురాలి కుటుంబానికి రూ. 25 వేల ఆర్థిక సాయం

చెన్నారావుపేట, అక్షర దర్బార్ : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన బొజ్జ పద్మ భర్త అంద్రు నర్సింహా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, పద్మ తోటి స్నేహితులు ఆమెకు అండగా నిలిచారు. చెన్నారావుపేట ప్రభుత్వ పాఠశాలలో 1994-95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.25వేల ఆర్థిక సాయం అందజేసి ఆదుకున్నారు.